# రైలు వెళ్ళిపోయింది

మడుపల్లి రమేష్ రాజు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ పూర్వ నిర్ణీత గమ్యం వైపు, నిర్ణీత మార్గంలో, నిర్ణీత వేగంతో సాగిపోతోంది.

ఎస్–6లో ఓ కిటికీ పక్కన కూర్చుని, ఆంధ్ర జ్యోతి చదువుకుంటోంది చారుమతి. తీరైన ముక్కు, చంపకి చారడేసి కాకపోయినా మరీ చిన్నవి కాని కళ్లు. చామనఛాయ, వయస్సు, 30




అతన్ని చూడగానే ఆమె ఎందుకు ఆశ్చర్యపడింది

దాటి వుండొచ్చు. అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు, ఇంట్లోంచి బయటపడి, వీధిలో పరుగులు తీస్తున్న పెంకి పిల్లల మధ్య పాపిట పైన గాలి వాటంగా కదలాడుతున్నాయి. ఆమె కళ్ల క్రింద నల్లటి చారలు, చూపులో అలసత్వం, పెట్టుకున్న కళ్ళజోడూ–ఆమె వయస్సుకి మరో 5 కలిపి చెబుతున్నాయి.

"చారక్కాయ్! కాసేపు కళ్లు మూసుకుని విశ్రాంతి తీసుకోకూడదటే, ఆ పత్రిక రేపైనా చదువుకోవచ్చుగా" ఆప్యాయంగా మందలించాడు పక్కనే కూర్చుని వున్న తమ్ముడు –'వెంకూ'

"ఫరవాలేదు నాన్నా! సాయంత్రం 4 కావస్తోంది. ఇంక ఇప్పుడేం నిద్ర" అంది చారుమతి, తమ్ముడి వంక మరింత ఆప్యాయంగా చూస్తూ


అప్పుడు గమనించింది–ఎదుటి సీట్లో ఓ నలభై ఏళ్ల వ్యక్తి–కాస్త నెరిసిన ఉంగరాల జుత్తు, గోల్డ్ ఫ్రేమ్ కళ్లజోడు, దాని వెనకాల నల్లని పెద్ద కళ్లు, పొడవాటి ముక్కు, కోల ముఖం, ఎక్కడో బాగా పరిచయం ఉన్న ముఖం. ఆ వ్యక్తి దీక్షగా 'ఇండియా టు డే' చదువుకుంటున్నాడు.

"ఈయన్ని ఎక్కడ చూశానబ్బా!" అని మనస్సులో ఆలోచించుకుంటూ, మెడలోని ముత్యాల హారాన్ని చూపుడు వేలికి చుట్టుకుంటూ పెదవుల మధ్య ఇరికించింది. అంతలోనే సిగ్గు పడి, హారాన్ని పెదవుల మధ్య నుంచే వదిలేసి సర్దుకు కూర్చుంది. అది 10–15 ఏళ్ల క్రితం నాటి అలవాటు. మెడలో ఏ హారం వేసుకున్నా దాన్ని చూపుడు వేలికి చుట్టి, పెదవుల మధ్య బిగించడం తనకి ఓ అలవాటు. ఆ చేష్ట, అన్యమనస్కంగా తనిప్పుడు చెయ్యటం, చారుమతికి చాలా ఆశ్చర్యం కలిగించింది. అంతలో మెదడులో ఒక మెరుపు. "అవును! గుడిపాటి వాళ్ల అబ్బాయి, ఇతను అచ్చు గుడిపాటి వాళ్ల అబ్బాయిలానే ఉన్నాడు"

గుడిపాటి వాళ్ల అబ్బాయితో తన పెళ్లి పీటల వరకూ కాకపోయినా, పెళ్లి పత్రికల వరకూ వెళ్లింది. ఆ పత్రిక ఒకటి ఇప్పటికీ తన పెట్టెలో పుస్తకాల మధ్య వుంది. పసుపూ, ఎరుపూ రంగుల కలగలుపు అంచులతో మధ్యలో ఓ వైపు తన పేరు, మరో వైపు ఆ పిల్లాడి పేరు, మధ్యలో పాణిగ్రహణం జరుగుతున్నట్టు రెండు అరచేతులు కలిపి వున్న బొమ్మ–భలే ఉంటుంది ఆ కార్డు.

"చారక్కాయ్! వేరు సెనగలు తింటావా? పుచ్చి పన్ను నెప్పెడుతుందేమో చూసుకో" తమ్ముడు వెంకూ, ఆప్యాయంగా జాగ్రత్త చెబుతూ, వేరు సెనగల పొట్లాం అందించాడు. ఎదురుగుండా కూర్చున్న వ్యక్తి చూపు, ఓసారి ఇండియా టుడే లోంచి పైకి లేచి చారుమతిని ఓసారి తాకి మళ్లీ ఇండియా టుడేలో లీనమైపోయింది.

చారుమతికి ఈసారి తమ్ముడి మాటలు ఆప్యాయంగా ధ్వనించలేదు. వెక్కిరిస్తున్నట్లనిపించాయి. "వీడికి వయస్సు పెరిగింది గానీ, బుద్ధి పెరగలేదు. అయినా వీడి మాటలకి ఆ ఎదురుగా కూర్చున్న ఆయన ఏమనుకుని ఉంటాడు?... తన వయస్సెంతనీ? ముప్పయ్ రెండు వెళ్లి ఇంకా ముప్పయ్ మూడు రాలేదు. పదహారేళ్ల పడుచు పిల్లలకి పళ్లు పుచ్చిపోవడం లేదూ? కట్టుడు పళ్లు పెట్టుకున్న వాళ్లని ఎంతమందిని తను చూడలేదూ? తనకి ముప్పయ్ ఏళ్లు దాటాకా, ఒక్కటంటే ఒక్కటి–దంతం పుచ్చిందంతే. అది కూడా 'సిమెంటింగ్' చేయించేసుకుంటే సరిపోతుందని పళ్ల డాక్టర్ ఎటూ చెప్పకనే చెప్పాడు. ఆపాటి దానికి, పుచ్చి పన్ను అంటూ అంతలా నలుగురిలో ఆరవాలా?" అని మనస్సులో విసుక్కుంది.




అంతలో ఎదురుగా కూర్చున్న వ్యక్తి తనకేసి ఓసారి చూసి చూపు మరల్చుకున్నట్టు చారుమతి గమనించింది. గబ గబా జడ ముందుకు వేసేసుకుని, చీర కొంగుతో ఒళ్లంతా కప్పకుని, చీర కుచ్చిళ్లలో పాదాలు కప్పకోబోయి ఓ క్షణం ఆగింది. "అసలు ఈ వ్యక్తి తన పాదాలని గమనించేడా? కాలి వేళ్లకి మట్టెలు లేకపోవడం గమనిస్తే, అతనికి తానింకా పెళ్లి కాని పడుచునని అర్థమవుతుంది" అనుకుని పాదాలు పై నుంచి కుచ్చిళ్లు మెల్లగా తప్పించింది. చేతిలో వున్న ఆంధ్రజ్యోతిలోకి కళ్లు మరల్చిందే గానీ, మనస్సు మాత్రం చదువుతున్న అక్షరాల మీద లేదు. మువ్వల మట్టెలు–తనకెంత ఇష్టమో! తను పెళ్లికి కొనుక్కుంది కూడా. అవి ఏ పెట్టె అడుగునో ఉండే ఉంటాయి. పది పదిహేనేళ్ల క్రితం తన కాలి వేళ్లు పొడవుగా, నాజుగ్గా, పొందికగా, భలే ఉండేవి. స్నేహితురాళ్లంతా, 'నీ పాదాలు చూసి, ఎవరో ఒకరు, నీ ముఖం చూడకుండానే వరించేస్తాడు' అని ఆట పట్టించేవాళ్లు. పాకీజా సినిమా చూస్తున్నప్పుడు రాజ్‌కుమార్ చీటీ రాసి, మీనాకుమారి మొహం చూడకుండానే ఆమె కాలి వేళ్ల మధ్య పెట్టినప్పుడు. తన ఒళ్లంతా పులకరింతలే పులకరింతలు.

సూర్యుడు తూర్పు కనుమల్లోకి వాలుతున్నాడు.

లేవండీ

శ్రీమతి నాయుడు




కాఫీ53% చికోరి 47%

టాటావారి కూర్గ్ డబుల్ రోస్ట్‌తో పుంజుకోండి చురుకుదనం. ఇది మహా శ్రేష్ఠమైన ఫిల్టర్-కాఫీ చికోరి మిశ్రమం. మీకూ, మీ శ్రీవారికీ, కుటుంబానికీ ఎంతో నచ్చే కాఫీ. అదేమరి దీని అపారమైన రుచి, అమితమైన ఘుమ ఘుమలు మరియు అంతులేని చిక్కదనాల మహిమ. లేవండీ మరి! హుషారుగా! ఉత్సాహంగా!

MAA Bozell 193.97

ఉత్తేజమిచ్చే రుచి

రైలు వంశధారా బ్రిడ్జి దాటుతోంది. అది నవంబరు నెల. మరీ చలి తిరగలేదు గానీ, చల్లగాలి చిలిపి చేష్టలు చేస్తోంది. తమ్ముడు వెంకూ బ్యాగ్‌లోంచి శాలువా తీసి చారుమతికి ఇస్తూ "చారక్కాయ్! శాలువా కప్పుకోవే చీకటి పడింది. అసలే నీకు ఒంట్లో బాగుండలేదు" అన్నాడు. తమ్ముడి వంక చుర చురా చూసింది చారుమతి. 'ఇంకా నయం నీకు ఉబ్బసం కదా అని అనలేదు' అనుకుంటూ ఎదురుగా కూర్చున్న వ్యక్తి వైపు ఓ దొంగ చూపు చూసింది. అతను తననే చూస్తున్నాడు. రెండు చూపులూ అర్క్షణం ఒకదానితో ఒకటి ముడిపడి వీడిపోయాయి. చారుమతి కాస్త తత్తరపడింది. 'ఏవిటా చూపు?' అనుకుంది. 'తనని జాలిగా చూశాడా? ఎందుకు? ఏవిటీ పెద్దమనిషి ఉద్దేశ్యం?' చారుమతి మెదడులో ప్రశ్నల పరంపర. 'కొంపతీసి తనను గానీ...' చారుమతికి ఒళ్ళంతా చెమటలు పోస్తున్నట్టనిపించింది. కప్పుకున్న శాలువ తీసి పక్కన పెట్టింది. కాస్త ఉపశమనం అనిపించింది. చేతులకున్న గాజులు ఎదుటి వ్యక్తికి కనిపించేలా సవరించుకుంది. ఎదుటి వ్యక్తి అనుమానం తీర్చడానికి అంతకంటే మంచి మార్గం లేదనుకుంది. ఎందుకైనా మంచిదని కంట్లో ఏదో నలుసు పడిందంటూ తమ్ముడి చేత బ్యాగ్ లోంచి అద్దం తీయించి, అందులో తన నుదిటి మీద ఉదయం దిద్దుకున్న తిలకం బొట్టు ఉందో లేదో చూసుకుంది. బొట్టు మరీ చిన్నదిగా అనిపించింది. పదిహేనేళ్ళ క్రితం నాడైతే తిలకంతో తీరుగా నుదిటి మీద పావలా కాసంత బొట్టు దిద్దుకునేది. చెల్లెళ్ళిద్దరూ తమకీ అలా నేర్పమని ఒకటే గొడవ చేసేవాళ్ళు. రాను రానూ ఆశక్తి తక్కువై, ఏదో ఒక చుక్క పెట్టేసుకుని రోజులు దొర్లించేస్తుంది. అసలు తను చామనఛాయ కన్నా ఓ ఛాయ ఎక్కువే. పోషణ ఏదీ? వారం వారం నలుగు స్నానాలూ, కొబ్బరి నూనెలో మెంతులు నానబెట్టి, కుంకుడు రసంతో తలంట్లూ, అన్నీ పోయాయి. చారుమతి కళ్ళు కాస్త చెమ్మగిల్లాయి. చీరకొంగుతో ముఖం తుడుచుకుంటున్నట్టు ఎవరూ చూడకుండా కళ్ళు ఒత్తేసుకుంది.

విశాఖపట్నం స్టేషన్‌లో బండి ఆగింది. ఎదురుగా కూర్చున్న వ్యక్తి బండి దిగి క్యాంటిన్‌లో ఏదో ఫలహారం తీసుకుని తింటున్నాడు. రైలు కిటికీలోంచి దీక్షగా అతడ్నే చూస్తుంది చారుమతి. అంత పొడవుగా లేకపోయినా బలిష్టంగా వున్నాడు. పొట్టి లాల్చీ తెల్లని పైజామా వేసుకున్నాడు. ఉంగరాల జుత్తు, పొడవాటి ముక్కు, తీరైన మీసకట్టు...ఈ వయస్సులోనే ఇలా వున్నాడంటే, మంచి వయస్సులో వున్నప్పుడు మంచి అందగాడే అయి వుంటాడు అనుకుంది చారుమతి. 'అచ్చు గుడిపాటి వాళ్ల అబ్బాయిలానే ఉన్నాడు' అని మరోసారి అనుకుంది. అంతలో ఆ వ్యక్తి తింటున్నదేదో గొంతులో అడ్డం పడి పొలమారింది. గబగబా మంచినీళ్ల కుళాయి వైపుకి వెళ్లాడు. 'అదేం మనిషి? మంచినీళ్ల సీసా కూడా తెచ్చుకోలేదా?' అని ఆశ్చర్యపోయింది చారుమతి.

అమ్మ కట్టిచ్చిన పులిహోర బాక్స్ తీశాడు తమ్ముడు వెంకూ. చారుమతికి ఏవీ తినాలనిపించలేదు. గుండె అంతా బరువుగా వుందనిపించింది. తమ్ముడి కోసం నాలుగు మెతుకులు కతికింది.

గుండెలో ఏదో కలత. తన గురించి తాను ఆలోచించుకుని ఎన్ని రోజులైందో – రోజులేవిటి? ఏళ్లయి వుంటుంది.

రైలు విశాఖపట్నం నుంచీ కదిలేసరికి రాత్రి తొమ్మిది దాటింది. బ్యాగ్ తలకింద పెట్టుకుని, శాలువా కప్పుకుని, బెర్త్ మీద నడుం వాల్చింది చారుమతి. పడుకుందే గానీ, కంటి మీద కునుకు రాలేదు. పక్క బెర్త్ మీదతను నిద్రలోకి జారుకున్నాడు. తమ్ముడు వెంకూ మిడిల్ బెర్త్ మీద గురక మొదలుపెట్టాడు. రైలు పెట్టె అంతా సద్దుమణిగింది. అక్కడక్కడా నీలి రంగు దీపాలు తప్ప అంతా చీకటిగా వుంది. రైలు లయ తప్పకుండా శబ్దం చేస్తూ సాగిపోతోంది. ఆ నిశీధిలో చారుమతి ఆలోచనలు మెల్లగా గతాన్ని త్రవ్వుకుంటూ బయలుదేరాయి.

'మూడు వేల రూపాయిలు తన జీవిత గతిని ఇంతలా మారుస్తాయని, తనే కాదు, ఎవ్వరూ ఊహించలేదు. తన చెల్లెళ్ళు, తోటి వాళ్లు సంసారాలు చేసుకుంటూ, పిల్లా పాపలతో కాలం ఎంత హాయిగా గడుపుతున్నారు. తన జీవితం ఎందుకిలా మోడుబారిపోతోంది? చారుమతికి, దుఃఖం గుండెల్లోంచి పొంగుకొస్తోంది. గట్టిగా వెక్కి వెక్కి కొంతసేపు ఏడవాలనిపించింది. చీర కొంగు నోట్లో కుక్కుకుని తమాయించుకుంది. కానీ పొంగుకొస్తున్న కన్నీళ్లకి ఆనకట్ట వెయ్యలేకపోయింది. 'జీవితాన్ని ఎంత అందంగా ఊహించుకుంది తనూ! పదిహేనేళ్ల క్రితం ఎన్ని కలలు, ఎన్ని ఆశలు, ఎన్ని ఆశయాలు. తను ఆశించిన, కోరుకున్న కలలు కన్న...జీవితం, చేతికి అందినట్టే అంది...

'ముహూర్తానికి ఇంకా 10 రోజులుందనగా తనూ చెల్లెళ్లు సరదాగా కబుర్లు చెప్పుకుంటూ పెళ్లి పత్రికల అంచులకి పసుపు పెడుతున్నారు. అమ్మ గోరింట నూరుతోంది. నాన్నగారు రిక్షా దిగి భారంగా నడుస్తూ వెళ్లి గదిలో మంచం మీద వాలారు. మంచినీళ్ల గ్లాసుతో గదిలోకి వెళ్లిన అమ్మ ఓ క్షణం తర్వాత 'చారుమతీ! వీధి చివర్న వున్న డాక్టర్‌ని త్వరగా తీసుకురావే' అని కంగారుగా తనకి పురమాయించింది. తను చేతులు కూడా కడుక్కోకుండా పరుగెత్తుకు వెళ్లి డాక్టర్‌ని తీసుకుని ఇల్లు చేరేసరికి, అమ్మ గుండెలు బాదుకుని ఏడుస్తున్నట్టు వీధిలోకే వినిపిస్తోంది.

'శుభకార్యం జరగాల్సిన రోజున ఇంట్లో పెద్ద కర్మ జరిగింది. పెళ్లి కోసం చేసుకున్న ఏర్పాట్లు కార్యాలకి ఉపయోగపడ్డాయి. బంధువులందరూ వచ్చారు, పరామర్శించారు. తనని చూసి జాలిపడ్డారు. వాళ్ల దారిన వాళ్లు వెళ్లారు. రోజులు గడుస్తున్నాయి. ఓ వైపు నాన్నగారు పోవడం కుటుంబాన్నంతటినీ దుఃఖ సాగరంలో ముంచేస్తే, మరో వైపు తనున్న స్థితేమిటో తనకి అర్థం కావడం లేదు. తండ్రి స్వర్గస్థుడైన ఏడాదిలోగా కూతురికి పెళ్లి జరిపిస్తే ఆ కన్యా దాన ఫలం పితృ లోకాల్లో ఆయనకి చెందుతుందంటారు. కానీ ఎవ్వరూ తన పెళ్లి విషయం పట్టించుకోవడం లేదు. తనకి తానుగా ఆ విషయం, ఎవరితోనైనా సిగ్గు విడిచి ఎలా ప్రస్తావించగలదు?

ఆ రోజు రంగారావ్ బాబాయ్ వచ్చాడు. నాన్నగారి ఆఫీసులోనే తనకి టైపిస్ట్ ఉద్యోగం ఇస్తున్నారని చెప్పి దరఖాస్తులు సంతకం పెట్టి ఇమ్మన్నాడు. ప్రశ్నార్థకంగా అమ్మ వైపు చూసింది తను.

తను కోరుకుంటున్న సమాధానం అమ్మవైపు నుంచి రాలేదు. తన మనస్సు బైటపెట్టక తప్పలేదు. 'మా అత్తగారు వాళ్ళకి, నేను ఉద్యోగం చెయ్యటం ఇష్టముంటుందో లేదో నమ్మా' అంది మెల్లగా అమ్మకి మాత్రమే వినిపించేటట్లు. అమ్మకి దుఃఖం ఆగలేదు. నోట్లో చీరకొంగు కుక్కుకుంటూ లేచి వంటగదిలోకి వెళ్ళిపోయింది. బాబాయి కళ్ళలో కూడా నీళ్ళు తిరిగాయి. బాబాయి చెప్పిన మాటలు విని తను స్థాణువులా నిలబడిపోయింది.

— మిగతా వచ్చేవారం

ప్రవాసాంధ్ర రచయిత(త్రి)లకు విజ్ఞప్తి:

**ఆంధ్రజ్యోతి వారపత్రిక ప్రత్యేకంగా ప్రవాసాంధ్ర రచయిత(త్రి)లకు అవకాశం ఇవ్వాలని సంకల్పించింది. కొత్త, పాత రచయిత(త్రు)లు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ కథలు అనువాద కథలు కవితలు, సాహిత్య వ్యాసాలను, పంపవలసిందిగా కోరుతున్నాం.**